క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

డబీర్‌పురా: చార్మినార్ మండల పరిధిలో ప్రభుత్వ భూముల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టిన వారు రెగ్యులరైజేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని చార్మినార్ మండల తహసీల్దార్ ఎస్.పి.ఆర్.మల్లేష్ కుమార్ అన్నారు. క్రమబద్ధీకరణ గడువును ఈ నెల 1 నుంచి 30వ తేదీ వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. సంబంధిత పత్రాలతో మీ–సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అవకాశాన్ని అర్హులైన ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి'

చాంద్రాయణగుట్ట: పదో తరగతి ప్రశ్నాపత్రం లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి రాజీనామా చేయాలని బీసీ విద్యార్థి సంఘం హైదరాబాద్ నగర ప్రధాన కార్యదర్శి ఆర్.రాజ్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దాదాపు ఐదు లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో అధికారులు చెలగాటమాడుతున్నారన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే పేపర్లు లీకవుతున్నాయన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ ఘటన మరువకముందే పదో తరగతి పరీక్షల ప్రశ్నాపత్రాలు రెండో రోజు కూడా లీకవ్వడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఇందుకు బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

జన్మదిన వేడుకలు



గౌలిపురా కార్పొరేటర్ భాగ్యలక్ష్మి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు

గౌలిపురా: బీజేపీ గౌలిపురా డివిజన్ అధ్యక్షులు జి.రఘుకాంత్ ఆధ్వర్యంలో మంగళవారం గౌలిపురా డివిజన్ కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కార్పొరేటర్ భాగ్యలక్ష్మితో నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సుమన్ కుమార్ ముదిరాజ్, మోకాళ్ల వెంకటేశ్, జమాల్‌పూర్ అశోక్, కె.రాజ్ కుమార్, జి.ఎం.జ్యోతి కుమార్, ఎం.ఉదయ్ కిరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద అన్నదానం

గోల్కొండ: ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద రోగులు, వారి సహాయకులకు ప్రతి రోజూ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని గోల్కొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బషీరుద్దీన్ తెలిపారు. మంగళవారం ఆయన గోల్కొండ ఏరియా ఆస్పత్రి వద్ద రోగులు, వారి సహాయకులకు భోజన ప్యాకెట్లు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈ అన్నదాన కార్యక్రమాన్ని 398 రోజులుగా నిర్వహిస్తున్నామన్నారు. దాతలు, శ్రేయోభిలాషుల సహకారంతో ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

ఘనంగా న్యూ ఈడెన్ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో చిన్నారులు

గోల్కొండ: గుడిమల్కాపూర్‌లోని న్యూ ఈడెన్ హైస్కూల్ ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. రాజలింగయ్య కబడ్డీ స్టేడియంలో జరిగిన వేడుకల్లో పాఠశాల కరస్పాండెంట్ బి.గాలయ్య ప్రీ ప్రైమరీ టీచర్లతో కలిసి చిన్నారులకు పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఎ. శశిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాయుధ రైతాంగ పోరాటానికి ఆద్యుడు దొడ్డి కొమురయ్య



నివాళులర్పిస్తున్న దర్పల్లి నర్సింహ, హన్మంతు

జియాగూడ: తెలంగాణ సాయుధ పోరాటం ఆద్యుడు దొడ్డి కొమురయ్య అని బీజేపీ రాష్ట్ర గొర్ల కాపరుల సెల్ కో కన్వీనర్ దర్పల్లి నర్సిములు అన్నారు. మంగళవారం జియాగూడలో మల్లన్న కురుమ సంఘం ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం చైర్మన్ కె.జగన్నాథ్, అధ్యక్షుడు హన్మంతు హిరోడే, ఉపాధ్యక్షులు డీఈ.రమేష్, ప్రధాన కార్యదర్శి అమర్నాథ్ హిరోడే, కోశాధికారి జి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే రంజాన్ ఉపవాసాలు



చెట్ల కింద తలదాచుకుంటున్న బాధితులు



జీహెచ్‌ఎంసీ స్వాధీనం చేసుకున్న ప్రాంతం ఇదే..

సాక్షి,సిటీబ్యూరో: లక్డీకాపూల్ ఏసీ గార్డ్స్‌లో ఉంటున్న 60 కుటుంబాలను ఇటీవల రెవెన్యూశాఖ ఖాళీ చేయించింది. సదరు స్థలం ప్రభుత్వానికి చెందినది కావడంతో వారిని ఖాళీ చేయించినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఉన్న ఫళంగా ఇళ్లను కూల్చివేయడంతో పదుల సంఖ్యలో కుటుంబాలు రోడ్డున పడ్డాయి. అద్దెలను భరించే స్థోమత లేని పేదలు ఫుట్‌పాత్‌లపైనే నివాసం ఉంటున్నారు. మండుతున్న ఎండల్లో చెట్ల నీడన తలదాచుకుంటున్నారు. పవిత్ర రంజాన్ మాసాన్ని ఇలా గడపాల్సి వస్తుందని కలలో కూడా ఊహించలేదని వసీమ్‌బీ అనే మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. 'రోజంతా ఉపవాసం ఉంటున్నాం. సాయంత్రం ఉపవాస దీక్షలు ముగించే సమయంలో, రోడ్డు పక్కన ఫుట్‌పాత్ పైనే పరదాలు, దుప్పట్లు వేసుకుని కూర్చుంటున్నాం. ఇక్కడే అల్లాను ప్రార్థించి రోజా ముగిస్తున్నాం' అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రంజాన్ వరకు గడువు ఇవ్వాలని వేడుకున్నా అధికారులు కరుణించలేదని గౌసియా సుల్తానా కన్నీటి పర్యంతమయ్యారు. 'నా బడ్డీ కొట్టు సామాను తీసుకుని, ఇక్కడే రోడ్డు పక్కన ఉంటున్నా. పక్కనే ఉన్న స్కూల్ ప్రిన్సిపాల్ కిరాణా సరకులు ఇచ్చి ఆదుకున్నారని చాంద్ అలీ అనే వ్యక్తి తెలిపాడు. రంజాన్ ఉపవాస దీక్షల్లో ఉన్న వారు ఎండలు పెరగడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి వారిని ఆదుకోవాలని ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు కోరుతున్నారు.

ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలి



పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ మహ్మద్ వసీయుద్దీన్

యాకుత్‌పురా: ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ పోషకాలు అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలని రెయిన్ బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీయుద్దీన్ సూచించారు. ఐసీడీఎస్ చార్మినార్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం రెయిన్‌బజార్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ ఐసీడీఎస్ అధికారులతో కలిసి మహిళలకు పోషకరమైన ఆహార పదార్థాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఐసీడీఎస్ అధికారులు, వైద్యుల సూచనలను పాటించాలన్నారు. మహిళలు, చిన్నారులు, కిశోర బాలికలు, గర్భిణిలు, బాలింతలు పౌష్టికరమైన ఆహారాన్ని తీసుకుంటే ఎలాంటి ఆరోగ్య సమస్యలు రాకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ జ్యోత్స్నా రెడ్డి, సెక్టార్ సూపర్‌వైజర్ శ్వేత, యాకుత్‌పురా–1 యుపీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ ఫర్హనాజ్, డాక్టర్ విశాల్, అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉస్మానియా ఆసుపత్రిలో పాము కలకలం

అఫ్జల్‌గంజ్: ఉస్మానియా ఆసుపత్రిలో మళ్లీ పాము కలకలం సృష్టించింది. మంగళవారం ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్ పరిసర ప్రాంతాల్లో పాము కనిపించడంతో క్యూరిటీ గార్డు, స్నేక్ సొసైటీ సభ్యునికి సమాచారం అందించాడు. వెంటనే అక్కడికి చేరుకున్న సొసైటీ సభ్యుడు గణేష్ పామును పట్టుకున్నాడు. గత కొద్ది రోజులుగా ఆసుపత్రిలోని పలు విభాగాల్లో తరచూ పాములు కనిపిస్తుండటంతో ఉద్యోగులు, వైద్యులు, రోగులు సహాయకులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే పలుమార్లు ఈ విషయమై జీహెచ్‌ఎంసీ సిబ్బందికి ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని ఉస్మానియా ఆసుపత్రి వైద్యాధికారులు తెలిపారు. మూసీనది దగ్గర ఉండటంతో తరచూ పాములు ఆసుపత్రిలోకి వస్తున్నాయని, జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని ఆసుపత్రి అధికారులు తెలిపారు.

నోరూరించే హై లైన్ హలీం



హలీం విక్రయిస్తున్న యజమాని సలీం

గన్‌ఫౌండ్రీ: రంజాన్ అనగానే మొదట గుర్తుకు వచ్చేది హలీం. 40 ఏళ్లుగా కింగ్‌కోఠి చౌరస్తాలోని హై లైన్ హలీం రెస్టారెంట్ మాంసాహార ప్రియులకు రుచికరమైన హలీం అందిస్తుంది. రెస్టారెంట్‌కు సంబంధించిన ప్రత్యేకతలను యజమాని సల్మాన్ సేట్ మంగళవారం 'సాక్షి'తో వెల్లడించారు. తమ రెస్టారెంట్‌లో వినియోగదారులకు రుచికరమైన హలీంతో పాటు పలు రకాల వంటకాలను అందిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా పాయా, జబాన్, నహారీ, మటన్, చికెన్, ఫిష్, పన్నీర్, మందీ, కుర్బానీ మిఠాలను వినియోగదారులకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రంజాన్ మాసంలో ఆరోగ్యవంతమైన పొటేలు మాంసం, నాణ్యమైన గోధుమలు, స్వచ్ఛమైన నెయ్యి, మసాలా దినుసులతో తయారు చేసిన హలీమ్‌ను అందిస్తున్నట్లు ఆయన వివరించారు.

కేసీఆర్ హయాంలో అన్నివర్గాల పండుగలకు ఆదరణ



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఆనంద్‌కుమార్ గౌడ్, నందుకుమార్ తదితరులు

అబిడ్స్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతనే అన్నివర్గాల ప్రజల పండుగలకు ఆదరణ లభిస్తుందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ అన్నారు. ప్రభుత్వం అన్ని మతాల పండుగలను స్వయంగా నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. మంగళవారం జాంబాగ్ సుభాన్‌పురాలో జరిగిన ఇఫ్తార్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అభివృద్ధితో పాటు ప్రజల మనోభావాలను గౌరవిస్తూ, వారి ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నందుకుమార్, మహ్మద్ అహ్మద్, మహ్మద్ ఆసీఫ్, మహ్మద్ గౌడ్, మహ్మద్ ఇబ్రహీం, మహ్మద్ ఖదీర్, సలీం, జహంగీర్ బబ్లు, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

గాడ్సే ఫొటోలు ప్రదర్శించిన వారిపై చర్యలు తీసుకోండి



ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న వి.హన్మంతరావు, మెట్టు సాయికుమార్

అబిడ్స్: శ్రీరామనవమి శోభాయాత్రలో గాడ్సే ఫొటోలు ప్రదర్శించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీ వి.హన్మంతరావు, రాష్ట్ర కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ చైర్మన్ మెట్టు సాయికుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం షాహినాయత్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ అజయ్‌కుమార్‌కు లిఖిత పూర్వక ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... గత నెల 30న శ్రీరామ నవమి శోభాయాత్రలో గాడ్సే ఫొటోను ప్రదర్శించడం బాధాకరమన్నారు. వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రైతులు బ్యాంకు సేవలను వినియోగించుకోవాలి

ఏజీవర్సిటీ: వ్యవసాయం అనుబంధ రంగాలకు అవసరమైన ఆర్థిక తోడ్పాటును తాము అందిస్తున్నామని రైతులు బ్యాంకుల సేవలను వినియోగించుకోవాలని నాబార్డ్ అడిషనల్ జనరల్ మేనేజర్ స్వాతి తివారి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న దక్షిణ తెలంగాణ మండల వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా సంఘం ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్యాంకులు రైతాంగం కోసం అనేక నూతన సబ్సిడీ పథకాలు ప్రవేశ పెట్టడం జరిగిందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన అనేక నూతన వ్యవసాయ పద్ధతుల గురించి పరిశోధన సంచాలకులు డాక్టర్ వెంకటరమణ వివరించారు. ఆధునిక పద్ధతుల్ని పాటించి సాగును లాభదాయకంగా మలుచుకోవాలని ఆయన సూచించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా ఎప్పటికప్పుడు అవసరమైన సమాచారాన్ని రైతాంగానికి అందజేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ప్రధాన శాస్త్రవేత్తలు వారి పరిశోధన ఫలితాలను రైతులకు వివరించారు. భూసార పరిరక్షణ, పంటల మార్పిడి, చిరుధాన్యాల సాగు, సహజ వనరుల పరిరక్షణ తదితర అంశాలపై శాస్త్రవేత్తలు, సూచనలు, సలహాలు ఇచ్చారు.

రెగ్యులరైజేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలి



ఇ.నవీన్, బండ్లగూడ తహసీల్దార్

చాంద్రాయణగుట్ట: ప్రభుత్వ భూమిలో ఇళ్లు నిర్మించుకున్న వారు 58, 59 జీఓ ద్వారా క్రమబద్ధీకరణ కోసం ఈ నెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవాలని బండ్లగూడ మండల తహసీల్దార్ ఇ.నవీన్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2020 జూన్ 2లోపు ప్రభుత్వ భూమిలో ఇళ్లు కట్టుకున్న వారు ఆధార్ కార్డు, ఆదాయం సర్టిఫికెట్, ఇంటికి సంబంధించిన పన్ను రసీదు, కరెంట్ బిల్లు తదితర ప్రతులతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.2 లక్షల లోపు వార్షికాదాయం కలిగి 125 గజాల లోపు ఇళ్లు నిర్మించుకున్న వారికి 58 జీవో కింద ఉచితంగా క్రమబద్ధీకరించనున్నట్లు తెలిపారు. రూ.2 లక్షలకు పైగా ఆదాయం కలిగిన వారు 59 జీఓ కింద నిర్ణీత మొత్తాన్ని చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలన్నారు.

రాజ్యసభ సభ్యుడు గులాం అలీ ఖాతానాకు సన్మానం



గులాం అలీ ఖాతానాకు మెమోంటో అందజేస్తున్న మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ

చార్మినార్: బీజేపీ తెలంగాణ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ మంగళవారం రాజ్యసభ సభ్యుడు గులాం అలీ ఖాతానాను కలిశారు. ఆయన దేశంలో మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యలు, పథకాలపై చర్చించారు. అనంతరం ఫిరాసత్ అలీ బాక్రీ గులాం అలీ ఖాతానాకు ''లీప్ గ్రీన్ ఎనర్జీ'' మెమోంటోను అందజేసి సత్కరించారు.

క్రమబద్ధీకరణపై విస్తృత ప్రచారం

దూద్‌బౌలి: ప్రభుత్వ భూముల్లో ఇళ్లు కట్టుకుని నివసిస్తున్న వారు జీఓ 58,59 ద్వారా ఈ నెలాఖరులోగా క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని బహదూర్‌పురా మండల తహసీల్దార్ జుబేదా బేగం అన్నారు. మంగళవారం సంజయ్‌గాంధీనగర్‌లో డిప్యూటీ తహసీల్దార్ జె.సందీప్, వీఆర్‌ఐలు, సిబ్బందితో కలిసి ఆమె క్రమబద్ధీకరణపై స్థానికులకు అవగాహన కల్పించారు. 2020 జూన్ 2వ తేదీ లోగా ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారు క్రమబద్ధీకరణకు అర్హులని తెలిపారు. ఆధార్ కార్డు, ఆదాయ ధృవీకరణ పత్రం, ఇంటి పన్ను రసీదు, కరెంటు బిల్లుతో సమీపంలోని మీ–సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలీసులపై దాడి కేసులో మరో నలుగురు నిందితుల రిమాండ్

గౌలిపురా: పోలీసులపై దాడికి పాల్పడిన కేసులో మరో నలుగురు నిందితులను మొఘల్‌పురా పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ శివ కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పాతబస్తీ చార్మినార్ సర్దార్ మహల్ ప్రాంతంలోని ఓ ఇంట్లో ఈ నెల 3న బంగారం రికవరీ కోసం వెళ్లిన మైలార్‌దేవ్‌పల్లి క్రైమ్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ గౌడ్‌తో పాటు నలుగురు జవాన్ల దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే ఎనిమిది మంది నిందితులను అరెస్ట్ చేయగా... పరారీలో ఉన్న ఖాదర్, ముంతాజ్‌జీర్, సోహేల్, ఓవైస్ అలీలను మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో ఓ మైనర్ బాలుడిని అదుపులోకి తీసుకుని జువైనల్ హోమ్‌కు తరలించారు.

బాలిక అదృశ్యం

రాజేంద్రనగర్: స్కూల్‌కు వెళ్లిన ఓ మైనర్ బాలిక కనిపించకుండా పోయిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సన్‌సిటీ ప్రాంతానికి చెందిన 16 ఏళ్ల బాలిక ఇంట్లో నుంచి స్కూల్‌కు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు స్కూల్‌తో పాటు బంధువులు, స్నేహితుల వద్ద వాకాబు చేశారు. సోమవారం ఉదయం సదరు బాలిక ఆటోలో స్కూల్‌కు వెళ్లినట్లు సమాచారం. ఆటో డ్రైవర్ కోసం వెతికినా జాడ తెలియక పోవడం, సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ ఉండటంతో తమ కూతురును ఆటో డ్రైవరే కిడ్నాప్ చేశాడని వారు ఆరోపిస్తూ.. పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జైన్ భవన్ నిర్మాణానికి కృషి : మంత్రి తలసాని

గన్‌ఫౌండ్రీ: నగరంలో జైన్ భవన్ నిర్మాణం, మైనార్టీ కమిషన్‌లో జైన్‌లను సభ్యులుగా చేర్చే అంశం రాష్ట్ర ప్రభుత్వం పరిశీలనలో ఉందని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో జైన్ సేవా సంఘం ఆధ్వర్యంలో మహావీర్ జైన్ 2622 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం తరఫున జైన్‌భవన్ నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేసే అన్ని సంక్షేమ పథకాలు జైన్‌లకు వర్తింపజేస్తామన్నారు. సమాజ శ్రేయస్సుకు పనిచేయాలని సందేశం ఇచ్చిన మహనీయుడు మహావీర్ జైన్ అని కొనియాడారు. జైన్ మతస్తులు తమ సంపాదనలో ఎక్కువ భాగం సమాజ హితం కోసం వినియోగిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా జైన్ మతస్తుల ఆధ్యాత్మిక పూజలు, ర్యాలీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ సికింద్రాబాద్ పార్లమెంటు ఇన్‌ఛార్జ్ సాయికిరణ్ యాదవ్‌లతో పాటు జైన్ సేవా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులతో ప్రేమాభిమానాలు



ఇఫ్తార్ విందులో అసదుద్దీన్ ఒవైసీతో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ఇఫ్తార్ విందులు స్థానికుల మధ్య ప్రేమాభిమానులకు అద్దం పడుతాయని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్, హైదరాబాద్ ఎంపీ, అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. మంగళవారం మెహిదీ కాలనీలో మజ్లిస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.... రంజాన్ మాసం పవిత్రమైనదని ఈ మాసంలోనే అల్లా ప్రత్యేకంగా దివ్యఖురాన్ గ్రంథాన్ని ప్రసాదించాడని తెలిపారు. రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఉండటంతో పాటు రాత్రిపూట జరిగే తరావీ ప్రార్థనల్లో పాల్గొనాలని సూచించారు. తరావీ ప్రార్థనల్లో మసీదు ఇమామ్ ఖురాన్ గ్రంథాన్ని వినిపిస్తారని, తరావీ ప్రార్థనలు కేవలం రంజాన్ మాసంలోనే జరుగుతాయన్నారు. రంజాన్ మాసంలో నిరుపేదలకు దానధర్మాలు చేయాలని, ఆస్తులు, న్యాయబద్ధంగా సంపాదించిన డబ్బులో నుంచి జకాత్ తీసి నిరుపేదలకు పంచాలని సూచించారు. ఇఫ్తార్ విందులో మజ్లిస్ నాయకులు హారూన్ ఫరాన్, వజీ ఉజ్‌జమా, బదర్ ఉద్దీన్, అలీమొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు



మయూరిని అభినందిస్తున్న మంత్రి హరీశ్‌రావు

చాంద్రాయణగుట్ట: ఇటీవల గోవాలో జరిగిన 3వ అంతర్జాతీయ కరాటే చాంపియన్‌షిప్‌లో గోల్డ్ మెడల్ సాధించిన ఉప్పుగూడకు చెందిన నిరుపేద విద్యార్థిని మయూరిని మంత్రి హరీష్ రావు అభినందించారు. బీఆర్‌టీయూ చాంద్రాయణగుట్ట ఇన్‌చార్జి ఆకుల శ్రీనివాస్‌తో కలిసి మంగళవారం ఆమె మంత్రిని కలిశారు. వచ్చే నెలలో మలేషియా ఇంటర్నేషనల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటున్న ఆమెకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి కేసీఆర్ క్రీడలను ప్రోత్సహిస్తుండడంతో ఎంతో మంది క్రీడాకారులు చాంపియన్లుగా నిలుస్తున్నారన్నారు.

సమాజ సేవలో ఎల్లప్పుడు ముందుంటాం



సరాబు లక్ష్మణ్ గుప్తాను సన్మానిస్తున్న దూద్‌బౌలి ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

దూద్‌బౌలి: సమాజిక సేవా కార్యక్రమాల్లో ఆర్యవైశ్య మహాసభ ఎల్లప్పుడూ ముందుంటుందని మహాసభ అధ్యక్షులు సరాబు లక్ష్మణ్ గుప్తా అన్నారు. ఆర్యవైశ్య మహాసభ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా దూద్‌బౌలి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఆనంద్ గుప్తా అధ్యక్షతన సరాబు లక్ష్మణ్ గుప్తాతో పాటు కమిటీ సభ్యులను దూద్‌బౌలిలోని శ్రీ వాసవీ భవనంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ఆర్యవైశ్య మహాసభ తరపున నిర్వహించే సేవా కార్యక్రమాలను వెల్లడించారు. ఈ నెల 16న లక్డీకపూల్‌లోని వాసవీ భవనంలో నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం ఉంటుందన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి కటకం శివ కుమార్ గుప్తా, కోశాధికారి లింగా ప్రకాశ్ గుప్తా, ఉపాధ్యక్షులు రేపాక వెంకటేశ్వర్లు, అదనపు ప్రధాన కార్యదర్శి కొక్కొక్క సత్యం గుప్తా, నాయకులు శ్రీరాం, దేవత శ్రీనివాస్ రావు, చంద్రశేఖర్ రావు, ఆనంద్ గుప్తా, ప్రభాకర్, గందె హనుమంత్ రావు, టి.శ్రీనివాస్, కొండూరు సృజన్, కె.ప్రదీప్, కూన వెంకట గోపాలకృష్ణ, కొమిరిశెట్టి స్వర్ణలత, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

చాంద్రాయణగుట్ట జంక్షన్‌లో సిగ్నల్ ఏర్పాటుకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట కొత్త ఫ్లై ఓవర్ కింద జంక్షన్‌లో ఎలాంటి సిగ్నల్ వ్యవస్థ లేని కారణంగా జరుగుతున్న ప్రమాదాల విషయమై 'సాక్షి' దినపత్రికలో మంగళవారం' ప్రమాదాలకు నిలయంగా చాంద్రాయణగుట్ట జంక్షన్' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఫలక్‌నుమా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవి ములుగూరి, జీహెచ్‌ఎంసీ అధికారులు ఈ విషయమై చర్చలు జరిపారు. వారం పది రోజుల్లో ఈ జంక్షన్‌లో సిగ్నల్ ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. గతేడాది ఫ్లై ఓవర్ ప్రారంభ సమయంలోనే జంక్షన్ ఏర్పాటు విషయమై అధికారులు ప్రతిపాదనలు రూపొందించినా కార్యరూపం దాల్చలేదు. ప్రమాదభరితంగా మారిన విషయమై వెలువడిన కథనం మేరకు హనుమాన్ జయంతి అనంతరం సిగ్నల్‌ను ఏర్పాటు చేయనున్నట్లు అధికారుల ద్వారా తెలిసింది.


కష్టపడే కార్యకర్తలకు సముచిత స్థానం



ఆనంద్ సింగ్‌ను సత్కరించిన నందకిశోర్ వ్యాస్ బిలాల్ తదితరులు

అబిడ్స్: కష్టించి పనిచేసేవారికి బీఆర్‌ఎస్‌లో సముచిత స్థానం ఉంటుందని రాష్ట్ర బీఆర్‌ఎస్ నాయకులు నందకిశోర్ వ్యాస్ బిలాల్ అన్నారు. ప్రతి కార్యకర్త, నాయకులకు పార్టీలో తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు ఆనంద్ సింగ్ జన్మదిన వేడుకలు గోషామహల్ రోడ్డులోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నందకిశోర్ బిలాల్ మాట్లాడుతూ కార్యకర్తలే పార్టీకి మూలమన్నారు. అన్నివర్గాల అభ్యున్నతి కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పప్పుమాత్రే, శైలేష్ కురుమ, సునీల్ సింగ్, ప్రదీప్ రాజ్, నాగరాజ్, శివ, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

6న హనుమాన్ జయంతి ఉత్సవాలు



చార్మినార్: మీరాలంమండిలోని మహంకాళేశ్వర దేవాలయంలో ఈ నెల 6న శ్రీ హనుమాన్ జయంతోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. ఈ నెల 6 వ తేదీ ఉదయం 5 గంటలకు శ్రీ అంజనేయ స్వామికి మహాభిషేకం, 6 గంటలకు విశేష అలంకరణ, ఆకు పూజ, అనంతరం అర్చన, మంత్రపుష్పం, 12 గంటలకు మహా నైవేద్యం, పంచ హారతి, తీర్థ ప్రసాద వితరణ, 1 గంటలకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నకిలీ సరుకులకు బ్రాండెడ్ లేబుళ్లు

- కర్ణాటకకు అక్రమ రవాణా
- నలుగురు నిందితుల అరెస్ట్

జియాగూడ: నగరం నుంచి నకిలీ నిత్యావసర సరుకులు తీసుకెళ్లి కర్ణాటకలో విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం ఇన్‌స్పెక్టర్ ఖలీల్‌పాషా వివరాలు వెల్లడించారు. అత్తాపూర్‌కు చెందిన అజయ్‌కుమార్ బూరె వృత్తిరీత్యా ట్రాన్స్‌పోర్టు మేనేజర్, అతను కిషన్‌బాగ్‌కు చెందిన ఆటో డ్రైవర్ సయ్యద్ ఇమ్రాన్, నింబోలి అడ్డాకు చెందిన ప్రేమ్‌రాజ్ పురోహిత్, అఫ్జల్‌గంజ్‌కు చెందిన పుఖ్‌రాజ్ పురోహిత్, రాజస్థాన్‌కు చెందిన కమల్ భాటీతో కలిసి ముఠా ఏర్పాటు చేశాడు. కాచిగూడలో నకిలీ నిత్యావసర సరుకులు తయారు చేసి వాటికి ఢిల్లీ నుంచి తెప్పించుకున్న బ్రాండెడ్ లేబుల్స్, బాక్సులు, స్టిక్కర్లను అతికించి కాటేదాన్‌లోని గోడౌన్‌కు తరలించేవారు. అదను చూసుకుని డిస్ట్రిబ్యూటర్లు ప్రేమ్‌రాజ్ పురోహిత్, పుఖ్‌రాజ్ పురోహిత్, మహేందర్ సింగ్ రాథోడ్‌తో కలిసి పలు దుకాణాలతో పాటు కర్ణాటకలోని వివిధ ప్రాంతాలకు రవాణా చేసేవారు. దీనిపై సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని షాహినాయత్ గంజ్ పోలీసులకు అప్పగించారు. ఈ దాడిలో ఎస్‌ఐ ముజఫర్ అలీ తదితరులు పాల్గొన్నారు.